ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## అవినీతి కేసుల్లో చట్టసభ సభ్యులకు మినహాయింపు లేదు

2లో..

సంపుటి: 1 | సంచిక: 330 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 5 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి



### మోదీ అంటే పక్కా గ్యారెంటీ అభివృద్ధి

### ఆదిలాబాద్ విజయసంకల్పసభలో ప్రధాని

ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'నా తెలంగాణ కుటుంబ సభ్యులారా..నా తెలంగాణ కుటుంబ సభ్యులకు నమస్కారాలు' అంటూ మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. ఇది ఎన్నికల సభ కాదని.. ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించనే లేదని అన్నారు. వికసిత్ భారత్ కోసం ఇక్కడకు ఇంత మంది రావటం సంతోషంగా ఉందని చెప్పారు. దేశ అభివృద్ధి కోసం రూ.వేల కోట్ల పనులను చేపట్టామని.. బీజేపీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. 15 రోజుల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. 15 రోజుల్లో రెండు ఐఐటీలు, ఓ ట్రిపుల్ ఐటీ, ఒక ఐఐఎం, ఎయిమ్స్‌ను ప్రారంభించినట్లు మోదీ వెల్లడించారు. దేశ అభివృద్ధి కోసం రూ.వేల కోట్ల పనులను చేపట్టామని.. తెలంగాణలో కూడా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ..మిగతా 2లో



## ప్రధాని మోదీ మేరా బడే భాయ్

### కేంద్రంతో మేం ఘర్షణ పెట్టుకోం

### ఆదిలాబాద్ ప్రధాని మోదీ సభలో సీఎం రేవంత్

### ఆదిలాబాద్ పర్యటనకు విచ్చేసిన ప్రధాని

### రూ.6,697 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆదిలాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): ఆదిలాబాద్ పర్యటనకు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ రూ.6,697 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆదిలాబాద్-బేల జాతీయరహదారి విస్తరణకు భూమిపూజ, అంబారి-ఆదిలాబాద్-పింపాల కట్టి రైల్వే లైన్ విద్యుదీకరణ ప్రారంభోత్సవం చేశారు. రామగుండంలో ..మిగతా 2లో



## పాతబస్తీ మెట్రో రైలు పనులకు మార్చి 8న శంకుస్థాపన



ఈ మార్గంలో మొత్తం 5 మెట్రో స్టేషన్లు
నాగోల్ నుంచి ఎల్బీ నగర్ మీదుగా
ఫలక్‌నుమా వరకు అనుసంధానం

2

## 4 స్థానాలకు ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్ఎస్



హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): వచ్చే లోక్ సభ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులను ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. భారత రాష్ట్ర సమితి తరపున సార్వత్రిక ఎన్నికల్లో ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, ..మిగతా 2లో

## నాకు ఇంగ్లీష్ రాదని కొందరు హేళన చేస్తున్నారు

### సర్కారు బడిలో చదువుకుని.. ఈ స్థాయికి ఎదిగా సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): తన ఇంగ్లీష్ భాష ప్రావీణ్యంపై బీఆర్ఎస్ నేతలు పదే పదే చేస్తున్న విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా కౌంటర్ చెప్పారు. తనకు ఇంగ్లీష్ రాదని కొందరు అవహేళనగా మాట్లాడుతున్నారని.. తాను సర్కారు బడిలో చదువుకుని.. ఈ స్థాయికి ఎదిగానని రేవంత్ రెడ్డి సమాధానం ఇచ్చారు. తాను తెలుగు మీడియంలో చదువుకున్నానని.. ఎక్కడెక్కడికో వెళ్లి కార్పొరేట్ స్కూళ్లలో చదువుకోలేదని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా.. లెక్చరర్లు, టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. మొత్తం 5192 మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియమాక పత్రాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అవన్నీ ఎల్బీ స్టేడియం వేదికగానే ఇచ్చామని.. తెలంగాణ చరిత్రలో ఎల్బీ స్టేడియం ఒక ప్రత్యేకతను సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగానే ఎల్బీ స్టేడియంలోనే రైతును రాజుగా చేసే పాలనకు నాంది పడిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రేవంత్ రెడ్డికి ఇంగ్లీష్ భాష సరిగా రాదని.. తరచూ ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలకు ఎల్బీ స్టేడియం సాక్షిగా ముఖ్యమంత్రి తిప్పి కొట్టారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివి.. సీఎం అయ్యాయనని పేర్కొన్నారు. మరోవైపు.. తనకు ఇంగ్లీష్ రాదని కొందరు అవహేళన చేస్తున్నారని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.. తాను జిల్లా పరిషత్ పాఠశాలలో ..మిగతా 2లో



## వనపర్తి జిల్లాలో రోడ్డు ప్రమాదం

### ఐదుగురు మృతి

వనపర్తి, మార్చి 4 (ప్రభాత ఉదయం): వనపర్తి జిల్లాలో సోమవారం నాడు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు.ఈ ప్రమాదంలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బళ్లారి నుండి హైద్రాబాద్‌కు ..మిగతా 2లో

## పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

### రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ

### పి.ఆర్.సి కమిషన్ కు సీపీఎస్ యూనియన్ వినతి
### తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని... డిమాండ్



పిఆర్సి కమిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎస్ రాష్ట్ర నాయకులు

రంగారెడ్డి, మార్చ్ 4 (ప్రభాత ఉదయం) పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేసి తమ డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. సోమ వారం హైదరాబాద్ లోని బి.ఆర్.కె భవన్ లో 2వ పి.ఆర్.సి కమిషన్ ఛైర్మన్ శ్రీ శివ శంకర్ కి తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ లు కలిసి 2 వ పి.ఆర్.సి లో అయిన 01.09.2004 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న కంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం రద్దు చేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ పాత పెన్షన్ పద్ధతి అమలు ఐయ్యేలా కృషి చేయాలని కోరారు. కమిషన్ కు సీపీఎస్ విధానంలో రిటైర్మెంట్ అయిన, చనిపోయిన కుటుంబాల కేస్ స్టడీ ల తో 20 పేజీల నివేదిక అందజేశారు. సీపీఎస్ విధానంలో ప్రతి సంవత్సరం ఉద్యోగి ..మిగతా 2లో

# ప్రధాని మోదీ మేరా బడే భాయ్





**మొదటి పేజీ తరువాయి...**

యూరియా ఉత్పత్తి పరిశ్రమను ప్రధాని శ్రీకారం చుట్టారు. రాష్ట్రం గుండా పరుగులు పెట్టనున్న 3 వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. రామగుండం ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. అలాగే వివిధ అభివృద్ధి పనులను బటన్ నొక్కడం ద్వారా శ్రీకారం చుట్టారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రజల తరపున ఘన స్వాగతం పలికుతున్నట్లు చెప్పారు. ప్రధాని అంటే రాష్ట్రాలకు పెద్దన్నలాంటి వారని.. కేంద్రంతో ఘర్షణలు సరికావని అన్నారు. తమ ప్రభుత్వం కేంద్రంతో ఘర్షణ పెట్టుకోదలచుకోలేదని చెప్పారు. ఘర్షణాత్మకవాతావరణం ఉంటే అభివృద్ధి వెనుకబడుతుందని చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయ పార్టీలని.. ఆ తర్వాత అంతా అభివృద్ధి గురించే చర్చలు ఉంటాయన్నారు. తమ వైపు నుంచి ఎటువంటి బేషజాలు ఉండవని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల గురించి చర్చించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ ఉత్పత్తిలో వెనుకపడ్డామని రేవంత్ అన్నారు. 'తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ ఉత్పత్తిలో వెనుకబడ్డాం. కేంద్రంతో పదేపదే ఘర్షణాత్మకమైన వైఖరితో ఉంటే రాష్ట్ర అభివృద్ధి వెనుకబడుతుంది. రాష్ట్రాభివృద్ధి కార్యాచరణతో ముందుకెళ్తాం. మావైపు నుంచి ఎలాంటి భేషజాలు లేవు. గుజరాత్‌లా తెలంగాణ అభివృద్ధి చెందేందుకు మీ సహకారం కావాలి. ప్రధానమంత్రి అంటే మాకు పెద్దన్నలాంటివారు. విభజన చట్టంలో నాలుగువేల మెగావాట్లకు బదులు కేవలం 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించాం. దేశంలో ఐదు ట్రిలియన్ ఎకానమీ సాధనకు తెలంగాణ సహకరిస్తుంది. కంటోన్మెంట్ రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి బదలాయించారు. ఇది తెలంగాణ అభివృద్ధిలో కీలకమైన స్కైవేల నిర్మాణానికి ఇది ఉపయోగపడుతుంది.' అని సీఎం రేవంత్ అన్నారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ.. తెలంగాణ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు. అందుకు ఆదిలాబాద్‌లో ప్రారంభించిన అభివృద్ధి పనులే నిదర్శనమన్నారు. వచ్చే ఐదేళ్లలో భారత్ అభివృద్ధి పరంగా మరింత ముందుకు వెళ్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు అవుతోందని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష అని చెప్పారు. తెలంగాణలో హైవేలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని.. ఎన్టీపీసీ రెండో యూనిట్‌తో తెలంగాణ అవసరాలు తీరుతాయన్నారు. ఆర్థిక వ్యవస్థ బలపడితే రాష్ట్రాలకు లాభం కలుగుతుందని మోదీ అన్నారు. పేదలు, దళితుల అభివృద్ధికి కేంద్రం అనేక చర్యలు చేపట్టిందని.. వచ్చే పదేళ్లలో భారత్ అభివృద్ధిపరంగా మరింత ముందుకెళ్తుందని వ్యాఖ్యానించారు.




### పాతబస్తీ మెట్రో రైలు పనులకు

## మార్చి 8న శంకుస్థాపన

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): పాతబస్తీ వాసులు ఎదురుచూస్తున్న మెట్రో రైలు పనులకు తొలి అడుగు పడనుంది. పాతబస్తీ మెట్రో రైలు నిర్మాణ పనుల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఫలక్‌నుమా వద్ద మెట్రో నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాతబస్తీ మెట్రో మార్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఖరారు చేసిన డీపీఆర్‌ను రద్దు చేసి, పలు మార్పులు చేసి కొత్త రూట్ మ్యాప్‌ను ఖరారు చేశారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు నిర్మించనున్న ఈ మెట్రో మార్గంలో మొత్తం 5 స్టేషన్లు రానున్నాయి. మొత్తం 5.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న ఈ నిర్మాణానికి సుమారు రూ. 2000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. జూబ్లీ బస్ స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు పాతబస్తీ మెట్రో నిర్మాణానికి 2012లోనే ప్రణాళికలు సిద్ధం చేసారు. కానీ, భూ సేకరణ, రోడ్డు విస్తరణ పనులు, నిర్మాణాల కూల్చివేత, ఇతర న్యాయ సంబంధిత కారణాల వల్ల ఈ మెట్రో నిర్మాణాన్ని ఎంజీబీఎస్ వరకే ఆపేశారు. ఆ తర్వాత పలు అంశాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే క్లియరెన్స్ వచ్చినా, పాతబస్తీ మెట్రో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. హైదరాబాద్ మెట్రో కారిడార్ 2లో ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఈ మార్గాన్ని విస్తరించనున్నారు. అంతేకాదు, ఎల్‌బీ నగర్ – నాగోల్ మధ్య మెట్రో మార్గం నిర్మాణాన్ని పూర్తి చేసి.. నాగోల్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## అవినీతి కేసుల్లోచట్టసభ సభ్యులకు మినహాయింపు లేదు

న్యూఢిల్లీ, మార్చి 4 (ప్రభాత ఉదయం): పార్లమెంటు సభ్యులు, శాసనసభ సభ్యులు శాసనసభలో ప్రసంగించడానికి లేదా ఓటు వేయడానికి లంచం తీసుకుంటే విచారణ నుంచి తప్పించుకోలేరని సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. పార్లమెంటరీ అధికారాల ద్వారా లంచానికి రక్షణ లేదని కోర్టు తేల్చి చెప్పింది. అలాగే రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఎమ్మెల్యే లంచం తీసుకుంటే అవినీతి నిరోధక చట్టం కింద విచారణ చేయవచ్చని కోర్టు పేర్కొంది. చట్టసభల అధికారాల ఉద్దేశ్యం, లక్ష్యాన్ని గుర్తుంచుకోవాలని కోర్టు నొక్కి చెప్పింది. ఆర్టికల్స్ 105(2) లేదా 194(2) సభ్యులకు స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపింది. ఈ సందర్భంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కేసులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పును తాజాగా ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏకగ్రీవంగా కొట్టివేసింది. పీవీ నరసింహారావు కేసులో ఇచ్చిన తీర్పు మేరకు.. లంచం స్వీకరించి తదనుగుణంగా ఓటు వేసే శాసనసభ్యుడికి రక్షణ లభిస్తోంది. అయితే, లంచం తీసుకున్నప్పటికీ స్వతంత్రంగా ఓట్లు వేసిన శాసనసభ్యుడిని విచారించే విరుద్ధమైన పరిస్థితి ఏర్పడుతుందని కోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్లిస్ బోపన్న, జస్టిస్ సుందరేష్, జస్టిస్ నరసింహ, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం 1998 నాటి తీర్పును తోసిపుచ్చింది. ఎవరైనా సభ్యుడు లంచం తీసుకుంటూ పట్టుబడితే అలాంటి వారికి ఆర్టికల్ 105 లేదా 194 ప్రకారం ఎలాంటి రక్షణ లభించదని తీర్పు చెప్పింది. చట్టసభలో ఓటు వేయడానికి లేదా ప్రసంగించడానికి లంచం ఆశించడం నేర పూరిత చర్యగా పేర్కొంది. లంచం ఆశించడం అనేది ఏ రూపంలో ఉన్నప్పటికీ అది నేర పూరితమేనని కోర్టు పేర్కొంది.



## నాకు ఇంగ్లీష్ రాదని కొందరు హేళన చేస్తున్నారు

**మొదటి పేజీ తరువాయి...**

తెలుగు మీడియంలో చదివినట్లు గుర్తు చేశారు. గుంటూరు, గుడివాడకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేదని కౌంటర్ ఇచ్చారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు.. తెలంగాణలో వేలాది గురుకులాలు నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్నారన్న సీఎం రేవంత్.. ఎక్కడా ఆ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించలేదని మండిపడ్డారు. వసతులు లేకుండా అద్దె భవనాల్లో గురుకులాలు నిర్వహించడంతో పేద విద్యార్థులు గత కొన్నేళ్లుగా నానా అవస్థలు పడుతున్నారని విమర్శలు చేశారు. రేషనైలేజేషన్ పేరిట మాజీ సీఎం కేసీఆర్ 6 వేల పాఠశాలలను మూసివేశారని విమర్శలు గుప్పించారు. కులవృత్తులు చేసుకునే వారి పిల్లలు.. ఆ కుల వృత్తులే చేసుకోవాలని గత ప్రభుత్వం భావించిందని.. అందుకే పేదలు గొర్రెలు, బర్రెలు, చేపలు మాత్రమే పెంచాలని పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ సమయంలోనే కేసీఆర్ మనవడు పెంచుకుంటున్న పెంపుడు కుక్క చనిపోతే.. వెటర్నరి డాక్టర్ మీద మాజీ ముఖ్యమంత్రి కేసు పెట్టారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అంటే కేసీఆర్ ఇంట్లోని పెంపుడు కుక్కకు ఉన్న విలువ ప్రజలకు లేదా అని ఈ సందర్భంగా సీఎం ప్రశ్నించారు. ఇక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో నిరుద్యోగులు, యువత పాత్ర ఎంతో గొప్పదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. వారి త్యాగాలు, బలిదానాలతోనే స్వరాష్ట్ర కల సాకారమైందని.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే తమకు న్యాయం జరుగుతుందని యువత భావించిందని.. కానీ కుటుంబ పాలనలో తెలంగాణ నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదని మండిపడ్డారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పదవులు ఊడగొడితేనే.. తమకు ఉద్యోగాలు వస్తాయని తెలంగాణ యువత, నిరుద్యోగులు భావించి.. గత ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని తెలిపారు. వారు అనుకున్నది చేయడంతోనే ఇప్పుడు వారికి ఉద్యోగాలు వస్తున్నాయని వెల్లడించారు.



## 4 స్థానాలకు ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్ఎస్

**మొదటి పేజీ తరువాయి...**

మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత, కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్ బరిలో దిగనున్నారు. తెలంగాణలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉన్నాయి. రానున్న లోక్ సభ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులను ఖరారు చేశారు ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోత్ కవిత, కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్ పేర్లను ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో రెండు రోజులుగా వివిధ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏకాభిప్రాయం ఉన్న అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. అభ్యర్థుల గెలుపుపై పార్టీ నేతలతో చర్చించారు. పలు సూచలను చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన రావడం లేదని, రాబోయే కాలం మనదేనని బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ అన్నారు. కరీంనగర్ స్థానం నుంచి బీజేపీ తరఫున బండి సంజయ్ కుమార్ పోటీ చేయనున్నారు. బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో బండి సంజయ్ పేరును ప్రకటించారు. దీంతో కరీంగనర్‌లో బండి సంజయ్, వినోద్ కుమార్ మరోసారి పోటీ పడనున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. మరోవైపు.. బీఆర్ఎస్ తరఫున నిజామాబాద్ నుంచి కల్వకుంట్ల కవిత, మల్కాజిగిరి స్థానం నుంచి కేటీఆర్ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గా సమీక్షలో భాగంగా రెండో రోజైన సోమవారం (మార్చి 4) ఖమ్మం, మహబూబాబాద్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. నేతలందరూ కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కరీంనగర్ తర్వాత ఖమ్మంలో బహిరంగ సభ ఉంటుందని పార్టీ నేతలకు కేసీఆర్ తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, కవిత ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఈ సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడేందుకే ముఖ్యమంత్రిని కలిసినట్లు ఆ తర్వాత వివరణ ఇచ్చారు.

## పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

మరియు ప్రభుత్వ కంట్రిబ్యూషన్ కలిపి 3000 కోట్లు ఎన్. పి.ఎస్ ట్రస్ట్ కు వెళ్తున్నాయని పాత పెన్షన్ విధానం అమలు వల్ల ఉద్యోగుల కుటుంబాలకు సామాజిక భద్రత చేకురుతుందని, వేతన సవరణ జరిగిన ప్రతి సారి షేర్ మార్కెట్ కు తరలివెళ్లే సొమ్ము పెరుగుతుందని తెలిపారు. అనంతరం సెక్రటేరియట్ లో ఫైనాన్స్ స్పెషల్ సెక్రటరీ రామకృష్ణ రావు ని కలిసి ఫ్యామిలీ పెన్షన్ జి.ఓ 58, తేది.11.06.2021 లో జారీ చేసిన నాటి నుండి కాకుండా ఉద్యోగి సర్వీస్ లో చనిపోయిన తేదీ నుండి అమలు పరిచేలా ఉత్తర్వుల పై సరయిన వివరణ ఇవ్వగలరని విన్నవించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు, నల్గొండ జిల్లా అధ్యక్షులు రాం దాస్ లు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో రూ.6.03 కోట్ల బంగారం పట్టివేత

### 13.65 కిలోల బంగారం సీజ్

శంషాబాద్ మార్చి 4 (ప్రభాత ఉదయం): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం అక్రమంగా తరలిస్తూ ఇటీవల చాలా మంది పట్టుపడుతున్నారు. బంగారం స్మగ్లింగ్ చేసే సమయంలో వారి చావుతెలివి తేటలు చూసి అధికారులు కూడా షాక్‌కు గురవుతున్నారు. బంగారాన్ని లో దుస్తుల్లో, సూట్‌కేసుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక అరల్లో, ఎలక్ట్రానిక్ వస్తువుల్లో కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి విదేశాల నుంచి అక్రమంగా ఇక్కడకు స్మగ్లింగ్ చేస్తున్నారు. బంగారాన్ని స్మగ్లింగ్ చేసే సమయంలో కొన్నిసార్లు తమ ప్రాణాలను కూడా పణంగా పెడుతున్నారు. తాజాగా.. గుట్టు చప్పుడు కాకుండా విదేశాల నుంచి అక్రమంగా బంగారాన్ని తరలిస్తూ కేటుగాళ్లు శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డారు. అర్ధరాత్రి వివిధ దేశాల నుండి విమానంలో హైదరాబాద్ వచ్చేందుకు శంషాబాద్ విమానాశ్రయంలోకి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి లగేజీ బ్యాగుతో పాటు ప్రయాణికులను స్కానింగ్ చేశారు. వీరిలో ముగ్గురు వ్యక్తుల వద్ద బంగారం ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ప్రయాణికులు బంగారం ముక్కలను శరీర భాగంలో, పురీషనాళంలో, హార్డ్‌వేర్ టూల్స్‌తో పాటు లగేజీ బ్యాగులలో అక్రమంగా పెట్టి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ముగ్గురు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.6.03 కోట్ల విలువ చేసే 13.65 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు ప్రయాణికులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు.



## బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. వికసిత్ భారత్‌పై ఆదివారం మంత్రులు, అధికారులతో సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని... కుటుంబ పార్టీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కుటుంబ పార్టీలో రెండే అంశాలు ఉంటాయని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని అన్నారు. ఒకటి దోచుకోవడం, రెండోది అబద్ధాలు చెప్పడం ఆ రెండే కుటుంబ పార్టీల సిద్ధాంతాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు జరిగిందేమీ లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగింది అన్న కాంగ్రెస్ ఇప్పుడు ఏం చేస్తోందని ప్రధాని మోదీ ప్రశ్నించారు. తన జీవితం తెరచిన పుస్తకమని.. మోదీ అంటే పక్కా గ్యారెంటీ అభివృద్ధి అని అన్నారు. తన ఇంటిని వదిలిపెట్టి.. ఓ లక్ష్యంతో ప్రజల ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఆదివాసీ సమాజం కోసం బీజేపీ కృషి చేస్తుందని.. ఆదివాసీల గౌరవాన్ని పెంచేందుకు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. బీజేపీ రాకముందు ఆదివాసీ మహిళ రాష్ట్రపతి అవుతుందని ఎవరైనా ఊహించారా? అని ప్రశ్నించారు. మోదీ గ్యారంటీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని.. మోదీ గ్యారంటీ అంటే కచ్చితంగా నెరవేరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 400 సీట్లకుపైగా లోక్‌సభ స్థానాల్లో గెలుపే తమ లక్ష్యమన్నారు. రాంజీ గోండు పేరుతో హైదరాబాద్‌లో మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని.. దేశవ్యాప్తంగా ఏడు టెక్స్‌టైల్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయించామన్నారు. సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ, రైతుల కోసం పసుపు బోర్డును ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

## వనపర్తి జిల్లాలో రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

కారులో వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లాలోని కొత్తకోట వద్ద జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం గురించిన తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుండి హైద్రాబాద్ కు వస్తున్న కారు వేగంగా చెట్టును ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందారు. వనపర్తి జిల్లాలోని కొత్తకోట వద్ద ఈ ప్రమాదం జరిగింది. సోమవారం నాడు తెల్లవారుజామున రెండున్నర గంటల నుండి మూడు గంటల మధ్య ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో 13 మంది ప్రయాణీస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులోని నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను వనపర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి కూడ విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అతివేగం, నిర్లక్ష్యం, నిద్ర మత్తు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బెంగుళూరు–హైద్రాబాద్ జాతీయ రహదారిపై ఈ ప్రాంతంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవర్ల నిద్రమత్తే రోడ్డు ప్రమాదాలకు కారణంగా పోలీసులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు నమోదౌతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు గాను ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నారు. అయితే డ్రైవర్ల నిర్లక్ష్యం, అతి వేగం ఈ ప్రమాదాలకు కారణంగా అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### ఆర్థిక ఇబ్బందులు

### రంగారెడ్డి జిల్లాలో ముగ్గురు పిల్లలను

## చంపి తండ్రి సూసైడ్

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని శంకర్ పల్లిలో సోమవారం నాడు విషాదం చోటు చేసుకుంది. ముగ్గురు పిల్లలను చంపి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు తండ్రి. అప్పుల బాధ తట్టుకోలేక ఈ దారుణానికి పాల్పడినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శంకర్ పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన రవి తన ముగ్గురు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే రవి ఈ దారుణానికి పాల్పడినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఓ స్కీంలో ఆదిక ఆధాయం కోసం పెట్టిన పెట్టుబడితో ఆర్థికంగా రవి ఇబ్బందులకు గురైనట్టుగా స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగానే రవి ఆత్మహత్య చేసుకున్నాడా ఇతరత్రా కారణాలున్నాయా అనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సమస్యలు పరిష్కరించండి సారు

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ డివిజన్ లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజేంద్రనగర్‌హొడిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్, డీఈ ని, వాటర్ వర్క్స్ జి ఎం లను సోమవారం కలిసి బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంజ బాబురావు లు కలసి విన్నవించుకున్నారు. డివిజన్ లోని పారిశుద్యం, రోడ్లు, డ్రైనేజీ , వీధిదీపాల సమస్యలపైన మెమోరాండం అందచేశారు. అనంతరం వై. శ్రీధర్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే రాజేంద్రనార్ డివిజన్ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్పొరేటర్ అభివృద్ధి గురించి పార్టీ మారాను అనిచెప్పుకోని ఈరోజు వరకు కూడా డివిజన్ సమస్యలపైనా మాట్లాడరు, పట్టించుకోరు అని వాపోయారు. డివిజన్ లో ఆమె ఎక్కడ కనిపించదు అన్నారు. డివిజన్ లో ప్రజలు చాల ఇబ్బందులకు గురి అవుతున్న ఎవరు పట్టించుకోరు అని వాపోయారు. బీజేపీ ప్రజల పక్షం ఉంటుంది అని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది పడిన బీజేపీ ముందుండి పోరాడుతుంది అని చెప్పారు. బాబురావు మాట్లాడుతూ రాజేంద్రనగర్ ఎన్ జె వై సి యూత్ క్లబ్ వెనకాల , యూనియన్ బ్యాంకు ముందు జగ్జీవన్‌రామ్ కాలనీ లో డ్రైనేజి సమస్య ఉందన్నారు. వర్షాకాలం స్టార్ట్ అయితే ఇంకతీవ్రం అవుతుందని గుర్తుచేశారు. వీధిదీపాలు సరిగ్గా వెలగవని, దోమలు అయితే ప్రతి బస్తీలో తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. బుద్వేల్ లో అయితే ప్రతి వీధికి సమస్యనే అని, రోడ్లు సరిగాలేవు , డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్థం గా ఉంది.... స్ట్రీటీలైట్స్ సరిగ్గా వెలగవు.... ఎవరికి చెప్పిన పట్టించుకోరు అని అన్నారు. ఉప్పర్ పల్లి లో ఎస్వీఆర్ గార్డెన్ లైన్ లో డ్రైనేజి పొంగి పొర్లుతూ ఉంటది అసలు ఆ రోడ్డులో నడవాలి అంటేనే బయపడేలా ఉంటుందన్నారు. సమస్యలను అధికారులు సరిగ్గా పట్టించుకోరని, పారిశుధ్య సమస్య అయితే వెక్కిరిస్తుందని, రోడ్లు సరిగ్గాలేవు అని గుర్తు చేశారు. శివరాంపల్లి లో అయితే సరస్వతి శిశుమందిర్ రోడ్డు మొత్తం గుంతలమయం అన్నారు. రోడ్డు వేయమని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ రోడ్డు కార్పొరేటర్ అర్చన ఇంటిపక్కనే ఉన్న తనకు ఉలుకు పలుకు తెలియదని వాపోయారు. వైకుంఠధామం దగ్గర అయితే పరిస్థితి మరోలా వుందని, పనికిరాని జంతుకలేబరాలను తెచ్చి ఇక్కడ వేస్తున్నారని, ఆ వాసనకు ముక్కుపుటలు బద్ధలై పోతున్నాయన్నారు. ఎవరైనా చనిపోతే వెళ్ళడానికి రోడ్డె సక్కగా లేదన్నారు. ఇన్ని సమస్యలు వెక్కిరిస్తున్న స్థానిక కార్పొరేటర్ ఎక్కడున్నారో... ఎవరికీ తెలియదన్నారు. ఎమ్మెల్యే అయితే రాజేంద్రనగర్ ప్రజలు నా దగ్గరికి రావద్దు అని అంటారని ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. అధికారులు ఏంచేస్తున్నారు అని బీజేపీ ప్రశ్నిస్తుంది. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లాకార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, విఠల్, పులిమామిడి రవీందర్, పసుపుల సందీప్ ముదిరాజ్, ఆర్. రాకేష్ గౌడ్ , స్వామి నాగుల, కవిత పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ కు వినతి పత్రం అందచేస్తున్న వై. శ్రీధర్, జి. బాబు రావు





అతిదులు

## నేడు శివరాంపల్లి విజయ్ ఆనంద్ గార్డెన్‌లో రాజేంద్రనగర్ జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శివరాంపల్లిలోని విజయానంద్ గార్డెన్ లో క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జర్నలిస్టులందరు కలిసి నాలుగు టీమ్ లుగా ఏర్పడి క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నారు. క్రికెట్ మ్యాచ్ నిర్వహణలో కన్వీనర్ యు. శ్రీకాంత్ అందరిని కలుపుకుపోతు ముందుకు సాగుతున్నారు. బాగా పని చేస్తున్నారు.

### దాతలు వీరే...

క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులకు టీ షర్టులతో పాటు మహిళల క్రీడలకు చీరలను ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి స్పాన్సర్ చేస్తున్నారు. క్రీడాకారులు వారి కుటుంబ సభ్యులకు సాక్షి దినపత్రిక రిపోర్టర్ గద్దె యాదగిరి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారుల కు ఆడటానికి క్రికెట్ కిట్ ఈ టీవీ సీనియర్ రిపోర్టర్ ఎం. బుజంగరెడ్డి స్పాన్సర్ చేస్తున్నారు. క్రీడాకారులందరికి బహుమతులను సాక్షి దినపత్రిక సీనియర్ రిపోర్టర్ బి. బాబు రావు స్పాన్సర్ చేస్తున్నారు. కూల్డ్రింక్స్ తో పాటు చిన్నారుల ఆటలకు బహుమతులను సూర్య రేఖ తెలుగు దిన పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ప్రేమ్ రాజ్ స్పాన్సర్ చేస్తున్నారు. వాటర్ ను రిపోర్టర్ దస్తగిరి, సౌండ్ సిస్టం ను రిపోర్టర్ రాజు, క్యాప్స్ ను రిపోర్టర్ కరుణాకర్, ఫోటో లకు శ్రీకాంత్, గణేష్ స్పాన్సర్, టిఫిన్స్ ను రిపోర్టర్ రవి, టీ, స్నాక్స్ లను రిపోర్టర్ మహేందర్ రెడ్డి లు షాల్స్ ను రిపోర్టర్ పవన్ భారతి, పూల మాలలు ప్రజా టైమ్స్ ఎడిటర్ పి. రాములు గౌడ్ లు సమకూరుస్తున్నారు. క్రికెట్ పోటీల నిర్వాహణ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. సూర్య కిరణ్, కమిటీ సభ్యులు ఏ. సుజీవన్ రెడ్డి, దస్తగిరి, ప్రశాంత్ రెడ్డి, ప్రేమ్ రాజ్ లతో పాటు సీనియర్ రిపోర్టర్ ఎం. బలసుబ్ర మన్యం, వర్కాల చందు లు ఏర్పాట్లలో సహకారం అందచేస్తున్నారు.



## ప్రభుత్వపరంగా నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటాం

### కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి, మార్చి 4 (ప్రభాత ఉదయం) ప్రమాదవశాత్తు మృతి చెందిన సెంట్రింగ్ కార్మికుడు నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హామీ ఇచ్చారు. సోమవారం మూసాపేట వాస్తవ్యుడైన సెంట్రింగ్ కార్మికుడు జి నారాయణకు కరెంట్ షాక్ తగలడంతో గత నెల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులు కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్ ని కలవగా బిల్డర్ తో మాట్లాడి రూ.15 లక్షల రూపాయలను నారాయణ కుటుంబ సభ్యులకు ఇప్పించారు. దీంతో నారాయణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతగా సోమవారం కుటుంబ సభ్యులు బండి రమేష్ ను కలిశారు. తమ కుటుంబాన్ని సకాలంలో ఆదుకున్నందుకు బండి రమేష్ తో పాటు కూకట్ పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, సయ్యద్ బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వపరంగా నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటామని ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు ఇప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూము సంతోష్ కుమార్, విట్టల్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, నాగమల్లి, మూసాపేట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.







శ్రేష్ఠ మేరీ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ చేస్తూ.... శ్రేష్ఠ మేరీ

## ఘనంగా శ్రేష్ఠ మేరీ జన్మదిన వేడుకలు

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ వాస్తవ్యులు అప్పారెడ్డిగూడెం మహేందర్ – కళాశ్రీ ల కుమార్తె శ్రేష్ఠ మేరీ జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె చేత కేక్ కట్ చేయించారు. కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు శ్రేష్ఠ మేరీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీలోని సెయింట్ అల్ఫోన్సా కరుణాలయంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వనం సౌమ్య

## అనాధల మధ్య వనం సౌమ్య జన్మదిన వేడుకలు

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకులు వనం నరసింహ మాదిగ పెద్ద కుమార్తె వనం సౌమ్య జన్మదిన వేడుకలను ఆదివారం రాత్రి బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీలో గల సెయింట్ అల్ఫోన్స కరుణాలయంలో నిర్వహించారు . కరుణాలయంలో ఉంటున్న 150 మంది మానసిక వికలాంగులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనం నరసింహ మాదిగ మాట్లాడుతూ, నా అనేవారు ఎవరు లేని వారి మధ్య జన్మదిన వేడుకలను జరుపుకోవడం వారికి ఆనందాన్ని కలగజేసిన వార మవుతామననే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరుణాలయం మేనేజర్ ఫాదర్ థామస్, వనం నర్సింహ కుటుంబ సభ్యులు వనం లక్ష్మీబాయి , వనం రమ్య, వనం దిలీప్ ప్రసాద్, వనం తిలక్ లు పాల్గొన్నారు.



వనం సౌమ్య

## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం):అనుమానంతో భార్యను హత్య చేశాడో వ్యక్తి. ఈ సంఘటన మైలార్ దేవుపల్లి డివిజన్ శాస్త్రిపురం కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది . వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చత్తీస్ ఘడ్ ప్రాంతానికి చెందిన అమ్రిత్ లాల్ సాహు (43)వివాహం జరిగి భార్య ఎటో వెల్లిపోయింది. అదే ప్రాంతానికి చెందిన మధు బాయి( 29) కు వివాహం జరిగి భర్త మరణించాడు. ఒంటరిగా ఉన్న వీరు కలిసి వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు పుట్టాడు. అమృత్ లాల్ సాహు , మధుబాయిలు శాస్త్ర పురంలో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్ వద్ద పనులు చేసుకుంటున్నారు . తన బార్య మధుబాయి పనిచేస్తున్న చోట ఇతర కార్మికులతో చనువుగా మాట్లాడుతుండటం భర్త కు నచ్చలేదు . ఈ విషయం పై వారం రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతుంది. ఆదివారం రాత్రి పడుకున్నాక అమృతలాల్ సాహు కూరగాయలు కోసే కత్తి తో భార్య ను హత్య చేయాలని భావించాడు. అయితే ఆమె లేచి అరవడంతో జోక్ చేస్తున్నానని చెప్పి సముదాయించాడు. తిరిగి కొద్దిసేపటి తర్వాత భార్య నిద్రలోకి జారుకున్నాక పెద్ద బండరాయి తీసుకువచ్చి తలపై మోదీ హత్య చేశాడు. అనంతరం మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకున్న ఇన్స్పెక్టర్ పి మధు దర్యాప్తు చేస్తున్నారు.

## మూడంతస్తుల మేడ పైనుంచి పడి వృద్ధురాలు మృతి



శారద బెన్

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : బట్టలు ఆరేస్తూ మూడంతస్తుల పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది . ఈ సంఘటన సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ భవాని కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భవాని కాలనీలో ఇతీష్ కుమార్ కుటుంబ నివాసం ఉంటుంది. నితీష్ కుమార్ తో పాటు భార్య కుమారుడు , అమ్మ నివాసం ఉంటారు. సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇతీష్ కుమార్ తల్లి శారద బెన్( 70) 3వ అంతస్తు పై దస్తులు ఆరవేస్తు కళ్ళు తిరిగి కిందపడిపోయింది. అక్కడికక్కడే మరణించింది. ఆమె కింద పడ్డ విషయాన్ని గమనించిన పై అంతస్తులోని భావన పటేల్ చూసి ఆమె భర్తకు సమాచారము ఇచ్చింది. ఆయన ఇతీష్ కుమార్ కు తెలపడంతో ఇతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని రాజేంద్ర నగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై బాను ప్రకాష్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు . అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకున్నారు. శారద బెన్ 2007 నుంచి బీపీ తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మ్యాథ్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న మండల విద్యాధికారి రామిరెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఎంఈఓ రామిరెడ్డి

## ఆదర్శ విద్యాలయ హై స్కూల్‌లో ఇంగ్లీష్ ఎగ్జిబిషన్, సైన్స్, మ్యాథ్స్ ఫెయిర్

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ ఆదర్శ విద్యాలయ హై స్కూల్ లో సోమవారం కరస్పాండెంట్ జి. శరవన్ కుమార్ – కల్యాణి ల ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఎగ్జిబిషన్, సైన్స్, మ్యాథ్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు చేసిన ప్రదర్శనలు చూసి అభినందించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఇంగ్లీషు ఎగ్జిబిషన్ లో విద్యార్థులు చేసిన లఘు నాటిక ప్రదర్శన ఎంతో చక్కగా ఉందన్నారు. తాము చేసిన ప్రదర్శన చూపరులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉందన్నారు.

### ప్రాక్టికల్ గా విద్యార్థుల ప్రదర్శనలు :

విద్యార్థులు చేసిన ఇంగ్లీష్ ఎగ్జిబిషన్, సైన్స్ , మ్యాథ్స్ ఫెయిర్ లు ఎంతో ప్రాక్టికల్ గా కనిపించాయి. ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠాలను ఇంగ్లీషు లఘు నాటిక ద్వారా చక్కగా ప్రదర్శించారు . గణితంలో ప్రాజెక్టులను ప్రాక్టికల్ గా చేసి చూపించిన తీరు అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు జి. సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజాదేవి , ఉప ప్రధానోపాధ్యాయురాలు అఫ్సర్ షాహిన్, ఉపాధ్యాయులు కిరణ్మయి, రేష్మ, నమ్రత , తులసి , ప్రమీల నాగ శ్రీ, లావణ్య , ఎం రాంబాబు యాదవ్ లు పాల్గొన్నారు.

## తండ్రి దేశాల శ్రీశైలం ఆశయం కోసం కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తనయుడు దేశాల భూపాల్

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన దేశాల శ్రీశైలం మరణించేవరకు కాంగ్రెస్ పార్టీ అభిమానిగా ఉన్నారు. దేశాల శ్రీశైలం 2023 ఏప్రిల్ ఆరవ తేదీన మరణించారు. ఆయన బతికున్న కాలంలో షాద్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అనేకసార్లు ప్రయత్నించాడు. 1982లో ఆయన ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తండ్రి కాంగ్రెస్ పార్టీ అన్నా , ఆ పార్టీలో పనిచేయడం అన్న ఎంతో ఇష్టపడిన విధానాన్ని చూసిన ఆయన పెద్ద కుమారుడు, న్యాయవాదిగా కొనసాగుతూ రాజేంద్రనగర్ లో నివాసమున్న దేశాల భూపాల్ కూడా తనకు రాజకీయ పరిజ్ఞానం వచ్చినప్పుడు నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ లీగల్ సెల్ కు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా కొనసాగుతున్నారు. సామాజిక కార్యకర్తగా పేరున్న దేశాల భూపాల్ మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్( ఎంవీఎఫ్) లో కీలక పదవులలో పనిచేశారు. అనేకమంది బాల కార్మికులకు విముక్తి కల్పించి వారికి విద్యాబుద్ధులు నేర్పించడంలో కీలకపాత్ర పోషించారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎంవీఎఫ్ ప్రతినిధిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి.

### నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి :

కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్న న్యాయవాది దేశాల భూపాల్ కు ఏదైనా నామినేటెడ్ చైర్మన్ గా నైన, డైరెక్టర్ గా నైన అవకాశం ఇవ్వాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. చదువుకున్న విద్యావంతులు, పేదలు, సమాజం పట్ల అవగాహన కలిగిన వ్యక్తిగా దేశాల భూపాల్ కు పదవి ఇస్తే ఆయన సరైన న్యాయం చేయగలుగుతారని అంటున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టి సారించాలని కోరుతున్నారు.



కాంగ్రెస్ నాయకులు, దివంగత దేశాల శ్రీశైలం



ప్రముఖ న్యాయవాది దేశాల భూపాల్

# మహా శివరాత్రి, మహాకుంభాభిషేకం మహోత్సవాలు విజయవంతం చేయాలి

## కలెక్టర్ బిఎస్ సంతోష్



గద్వాల, మార్చి 4(ప్రభాత ఉదయం) మహా శివరాత్రి మరియు మహాకుంభాభిషేకం మహోత్సవములు%--%2024 ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసే విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ, మున్సిపల్, పోలీసు , విద్యుత్తు, వైద్య ఆరోగ్యశాఖ, రోడ్లు భవనాలు, తదితర శాఖల అధికారులతో ఏర్పాట్ల విషయమై జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి దర్శనం కోసం వస్తారు కనుక అందుకు అనుగుణంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. 12 సం.లకు ఒకసారి వచ్చే మహా కుంబాభిషేకము కార్యక్రమములు ఈ నెల 4వ తేది నుండి 8వ తేది వరకు నిర్వహించే ఉత్సవాల సందర్భముగా 8వ తేది శుక్రవారము రోజు మహా శివరాత్రి మరియు మహా కుంబాభిషేకము మహోత్సవ దర్శనార్థమై విచ్చేయు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ,దర్శనం అయ్యి తిరిగి వెళ్ళే వరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగు నీరు , పార్కింగ్, నిరంతర విద్యుత్ , వైద్య సదుపాయం ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహా శివరాత్రి , మహా కుంబాభిషేకము మహోత్సవమును నాడు ఎలాంటి తోపులాట జరుగకుండా, తుంగభద్ర నది పుష్కర ఘాట్ నందు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఏమైనా సమస్యలు తలెత్తుతే అలంపూర్ ఎస్.ఐ 8712670285, సి.ఐ 8712670286 మరియు అత్యవసర సేవలకు దేవాదయ శాఖ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ 08502241327 కు భక్తులు సంప్రదించాలని అన్నారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 102, 108 వాహనాలను దేవాలయం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. హెల్త్ క్యాంపు నందు ఓ.ఆర్.ఎస్ ప్యాకేట్స్, అవసరమైన మందులతో పాటు మెడికల్ ఆఫీసర్, ఆశ, ఎ.యెన్.ఎం లను 24 గంటాలు అందుబాటులో ఉంచాలన్నారు. తుంగభద్ర నది పుష్కర ఘాట్ నందు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులకు ఆదేశించారు. అలంపూర్ చౌరస్తా నుండి అలంపూర్ వరకు 03 బస్సులను, మరియు కర్నూలు నుండి అలంపూరు వరకు 07 అధనపు బస్సులను నడిపించాలని డిపో మనేజేర్ కు ఆదేశించారు. మున్సిపల్ శాఖ అద్వర్యంలో పారిశుధ్యంతో పాటు విధి దీపాలు నిరంతరం వెలిగించాలని, ఆలయం పరిసరాలలో చెత్త కనపడకుండా ఎప్పటికపుడు శుభ్రపరిచి, బ్లీచింగ్ పౌడర్ వేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని అగ్నిమాపక సిబ్బందికి ఆదేశించారు. ప్రధాన రహదారిపై రోడ్డుపై తీసిన గుంతలను మరమతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఈవో పురెందర్, డి ఎం హెచ్ ఓ శశికళ, మిషన్ భగీరథ శ్రీధర్ రెడ్డి, డి.ఎస్.పి కే.సత్యనారాయణ, ఆర్.టి.సి డి.ఎం మంజుల,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

## శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పిలుపు

కూకట్‌పల్లి, మార్చి 4 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రతి కార్యకర్త ఒక్క సానికుడిలాగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్ డివిజన్ సిద్దిక్ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బస్తీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు దిశగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందు, గోపాల్ గౌడ్, ఫాజిల్, గణేష్, రవి యాదవ్, వినయ్ రెడ్డి, గాల్ రెడ్డి, వెంకటస్వామి, అప్పల్ కుమార్ యాదవ్, యోగి రెడ్డి, యాదయ్య గౌడ్, రవి కుమార్, నర్సిములు, దాస్, ఆకాష్, లక్ష్మీ బాయి, సైదమ్మ, ఏడుకొండలు, రిషి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఈటెల రాజేందర్‌ను గెలిపించుకుంటాం

## ఈటెలకు మద్దతు తెలిపిన వడ్డేపల్లి రాజేశ్వర్

కూకట్‌పల్లి, మార్చి 4 (ప్రభాత ఉదయం) వివేకానంద నగర్ కాలనీలోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాసంలో మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి పార్టీ అభ్యర్థి ఈటెల రాజేందర్ తనకు మద్దతు తెలపాలని సోమవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా నియమితులైన ఈటెల రాజేందర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి ఈటెల రాజేందర్ కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, మల్కాజిగిరి ఎంపీగా ఈటెల రాజేందర్ ను గెలిపించి మోడీ కి బహుమతిగా అందిస్తామని అన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, వడ్డేపల్లి శ్రీనివాస రావు, కంటెస్టెడ్ కార్పొరేటర్ నాయినేని పవన్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలంలో శివ భక్తులకు అన్నదానం

గద్వాల,మార్చి4(ప్రభాత ఉదయం)ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజులపాటు శివ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం శ్రీశైలంలో ఏర్పాటు చేశారు. పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ అర్చకులు ఆధ్యాకేశవాచార్య ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ స్వామి అన్నదాన ట్రస్ట్ గత 12 సంవత్సరాలుగా శ్రీశైలంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మధ్వాచార్యులు వామన చారి, కిష్టచారి మాజీ మార్కెట్ యార్డ్ నందిన్నె ప్రకాష్ రావ్, అడ్వకేట్ శ్రీకాంత్ సత్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పురుగుమందుతో అదనపు కలెక్టర్ కార్యాలయంలోకి వచ్చిన బాధిత మహిళ

# భూ సమస్య పరిష్కరించాలంటూ పురుగుల మందు డబ్బాతో ఓ మహిళ హాల్‌చల్

గద్వాల ,మార్చి4(ప్రభాత ఉదయం)తన పేరు మీద ఉన్న పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులలో చేర్చడంతో భూ సమస్య పరిష్కరించాలని రెవెన్యు అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కరించకపోవడంతో ఓ మహిళా రైతు మనోవేధనకు గురైంది. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుల మందు డబ్బాతో హాల్ చల్ చేసింది. దీంతో అక్కడ సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. వివరాలకు వెళ్లితే.... వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన గోకారి బీ కి సర్వే నంబర్ 416 లో ఒక ఎకరా భూమి ఉంది. అయితే దానిని ప్రభుత్వ భూమిగా రికార్డులోకి అధికారులు నమోదు చేశారు. తన భూమిని అధికారులు తప్పుగా ప్రభుత్వ భూమిగా రాశారని, దానిని తన పేరు మీద మార్చాలని పలుమార్లు తహసిల్దార్, అదనపు కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మనస్థాపానికి గురై తన భూమిని తన పేర ఎక్కించాలని కోరుతూ జిల్లా అదనపు కార్యాలయం వద్ద పురుగుల మందును సేవించడానికి సిద్దంకావడంతో గమనించిన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులు ఆమెతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



# మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

అలంపూర్,మార్చి4(ప్రభాత ఉదయం) శ్రీశైల పశ్చిమ ద్వార క్షేత్రమైన అలంపురం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం మహాగణపతి పూజా రిత్విక్వరణం, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముఖ్యంగా మార్చి 8 న జరిగే మహాకుంభాభిషేక క్రతువును రిత్వికులు అర్చకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల మండపంలో ప్రారంభించారు. ఉత్సవాల ప్రారంభ పూజలలో ఆలయ ఈవో పురేందర్ చైర్మన్ కృష్ణయ్య ముఖ్య అర్చకులు ఆనంద్ శర్మ తోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో వారం రోజులపాటు అఖండ భజనలు చేసిన భజన మండలి సభ్యులకు దేవస్థానం వారు ప్రశంస పత్రాలు అందజేసి సన్మానం చేశారు.



నామకరణోత్సవం లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భరత సింహారెడ్డి

# నామకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డికె భరతసింహ్మారెడ్డి

గద్వాల ,మార్చి4(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా కేంద్రంలోని హరిత టూరిజంలో జరిగిన సైకిల్ షాప్ తిమ్మప్ప మనమరాలి నామకరణ మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డికె భరతసింహ్మారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, తదితరులు హాజరై చిన్నారికి మరియు తల్లిదండ్రులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతోను వర్థిల్లాలని దీవించడం జరిగింది.



# గద్వాల నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరణ

గద్వాల,మార్చి4(ప్రభాత ఉదయం) గద్వాల నూతన ఆర్డీఓగా రాంచందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీలో భాగంగా గద్వాల ఆర్డీఓ విధులు నిర్వహిస్తున్న చంద్రకళ ప్రత్యేక భూ సేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ (ఎస్.డి.సి) గా మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నూతన ఆర్డీవోగా నారాయణపేట ఆర్డీఓ రాంచందర్ ను గద్వాలకు బదిలీ చేశారు.



# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు

గద్వాల,మార్చి4(ప్రభాత ఉదయం)ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని ప్రముఖ సామాజికవేత్త చుక్క సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గద్వాల మున్సిపాలిటి పరిధిలో 16వ వార్డులోగల భీంనగర్, రెవెన్యూ కాలనీలో ఏఎన్ఎం అలివేలు ఆశావర్కర్ హేమలత ఇంటింటికి తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలియో మహమ్మారిని తరిమి చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు.



# గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

గద్వాల ,మార్చి4(ప్రభాత ఉదయం) హైదరాబాద్ లోని టోలిచౌక్ లో నిర్వహించిన నేషనల్ లేవల్ కుంగ్ ఫూ , కరాటే మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్ లో గద్వాల పట్టణం దౌదర్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానం సాధించి 11 గోల్ట్ మెడల్ సాధించినట్లు మాస్టర్ ఫారూక్, నిషాలు తెలిపారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

## చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ ,మార్చి 4(ప్రభాత ఉదయం)మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చేవెళ్ల భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. హెూటల్ దసపల్లాలో శేరిలింగంపల్లి కమ్యూనిటీకి చెందిన రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని పరిచయం చేశారు. ఈ వేదిక స్థానిక సమస్యలను అర్థం చేసుకోవడం, పరిష్కరించడంపై దృష్టి పెట్టింది. ఈ సందర్భంగా ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. ఈ సెషన్‌లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంఘం కోసం తన విజన్‌ను ఆవిష్కరించారు. గేటెడ్ కమ్యూనిటీలకు దగ్గరగా కమ్యూనిటీ పాఠశాలలు, క్లీనర్ లేక్స్, మెరుగైన వాకింగ్ ట్రాక్‌లు, మెరుగైన విద్యుత్, నీటి వనరుల నిర్వహణపై మాట్లాడారు. ఈ చర్చలో బీజేపీ ప్రధాన సూత్రాలను వివరించారు. వ్యక్తిగతంగా సభ్యులతో సంబంధం లేకుండా పార్టీని ఎలా నడిపిస్తాయో కూడా తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక విధానాలు, పురపాలక పాలనపై వాటి ప్రభావంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ పట్టణ వాసుల అవసరాలను తీర్చడంలో తనకున్న నిబద్ధతను తెలియజేశారు. మెరుగైన పట్టణ భవిష్యత్తే తన లక్ష్యమన్నారు. అందుకోసం మేనిఫెస్టోను వచ్చే వారంలోపు విడుదల చేస్తానన్నారు. విద్యుత్ మీటరింగ్, నిర్వహణ వ్యూహాలు, ఖర్చులు ఎలా తగ్గించాలో వివరించారు. నీటి నిర్వహణ విధానాలపై తాను విస్తృతమైన పరిశోధనలు చేశానని, ఆచరణాత్మక పరిష్కారాలను అమలు చేయడానికి జలవనరుల శాఖతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.